క్లుప్తంగా

135 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో ఆదివారం మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 135 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 18 మందికి శుక్లాల ఆపరేషన్లు నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ శిబిరంలో పరీక్ష చేయించుకున్న 32 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మరడాని రంగారావు, లయన్ బెల్లంకొండ మురళి పాల్గొన్నారు. వచ్చినవారికి పీ. పండరీనాథ్, బొలిశెట్టి సురేష్ కుమార్, చెన్నా వెంకటరామయ్య సేవలు అందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెదపాడు: సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని త్రీ టౌన్ సీఐ వి కోటేశ్వరరావు తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, సమాజంలో స్త్రీలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ వేధింపులు అత్యవసర సమయంలో చేయవలసిన విధులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, అభయహస్తం టోల్ ఫ్రీ నంబర్లు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివకిశోర్ మాట్లాడిన అవగాహన వీడియోను స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజబాబు మరణం తీరని లోటు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీనియర్ రాజకీయ నాయకులు చెలికాని రాజబాబు ఆకస్మిక మరణం తమను కలచివేసిందని వ్యక్తిగతంగా పార్టీ పరంగా ఆయన మరణం తీరనిలోటని ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ సీనియర్ నేతగా రాజబాబు గ్రామాల అభివృద్ధికి శ్రమించారన్నారు. పెదవేగి పార్టీ మండల అధ్యక్షుడు జానంపేట బాబు, రాష్ట్ర హస్త కళల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎం సూర్యనారాయణ, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు, విజయవాడ కనకదుర్గమ్మ తల్లి ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్ తొత్తడి వేద కుమారి, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ సంతాపం తెలిపారు.

ట్రాఫిక్ చింత.. తీరేదెట్టా?

- ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వీధి వ్యాపారులు
- పద్మవ్యూహాన్ని తలపిస్తున్న నగరం
- క్రమబద్ధీకరణను పట్టించుకోని పాలకులు, పోలీసులు



రామచంద్రరావుపేట ప్రధాన రహదారిలో ఇరువైపులా ఆక్రమణలు



పత్తేబాద రైతు బజారు వద్ద ప్రయాణికుల రద్దీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నిత్యం ఏలూరు నగరం ట్రాఫిక్ సమస్యలతో పద్మ వ్యూహాన్ని తలపిస్తోంది. ప్రధాన కూడళ్లన్నీ ప్రయాణికులు, వాహనదారుల రద్దీతో కిటకిటలాతున్నాయి. ఎక్కడ చూసినా ఆక్రమణల పర్వం కనిపిస్తోంది. దీనిపై పాలకులకు, పోలీసులకు చిత్తశుద్ధి లేకపోవడం ప్రజలు నిత్యం నరకాన్ని చవిచూస్తున్నారు. పెరిగిన నగర జనాభాకు అనుగుణమైన సౌకర్యాలు కల్పించడంలో పాలకుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. నగరానికి చెందిన సామాజిక కార్యకర్తలు ట్రాఫిక్ సమస్యలపై పాలకులు, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా వారి నుంచి ఆశించిన స్పందన కనిపించడం లేదు. ఆఖరికి జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకువెళ్లినా అక్కడి నుంచి సమస్యలను పరిష్కరించాలని నగర పాలక అధికారులకు, పోలీసులకు ఆదేశాలు వచ్చినా ఫలితం శూన్యం. సమస్య పరిష్కారమైందా లేదా అనే విషయాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రయాణికుల ఇక్కట్లు యథాతథంగా ఉంటున్నాయి.

ప్రధాన కూడళ్లలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

నగరంలోని ప్రధాన కూడళ్లలో వీధి వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతోంది. ప్రధానంగా రామచంద్రరావుపేట, వేంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఫుట్‌పాత్‌లకు ఇరువైపులా వ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారు. కేవలం ఫుట్‌పాత్ ఆక్రమణలతో సరిపెట్టకుండా ఆయా ప్రాంతాల్లో రోడ్లకు సగం వరకూ వచ్చేలా టార్పాలిన్ కవర్లతో నీడ కోసం ఏర్పాటు చేసుకోవడంతో సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా శని, ఆదివారాల్లో ఈ ప్రాంతం నగర ప్రజలతో రద్దీగా ఉంటుంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు, పాదచారులు సైతం ఈ ట్రాఫిక్‌కు బాధితులుగా మారుతున్నారు. దీనిపై గతంలో ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాథుడు కనిపించడం లేదు. ఒక్కొక్కసారి ఆయా వ్యాపారులు ప్రయాణికులను, వాహనదారులను కొట్టినంత పని చేస్తున్నారు. ప్రజలకు, వ్యాపారులకు తగాదాలు జరగడం ప్రధాన రహదారులపై నిత్యకృత్యంగా మారింది.

పద్మవ్యూహాన్ని తలపిస్తున్న నగరం

స్థానిక పత్తేబాద నాలుగు గుడుల సెంటర్ నుంచి రైతు బజారు దాటేవరకూ రద్దీ నిత్యం వేధిస్తోంది. ఈ ప్రాంతంలో రోడ్డుకి ఇరువైపులా పండ్ల వ్యాపారులు తోపుడు బండ్లను పెట్టి వ్యాపారాలు చేసుకుంటుంటూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. ఈ ప్రాంతంలో తోపుడు బండ్లను పెట్టడంతో రహదారి ఆక్రమణకు గురై కార్లు, ఆటోలు తిరగడానికి ఇబ్బందికరంగా మారుతోంది. రైతుబజారు వద్ద ఒక పండ్ల వ్యాపారి అక్కడి స్థానిక టీడీపీ నాయకుని ఫ్లెక్సీ పెట్టి అతనిని మంచి చేసుకోవడంతో పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. రద్దీ ఎక్కువైన సమయంలో ఏదో ఒకసారి అలా ప్రత్యక్షమై బళ్లు తీసేయాలని హడావిడి చేసి వెళ్లిపోవడం, తిరిగి ఆ వ్యాపారులు అక్కడే బళ్లు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం పరిపాటిగా మారింది. స్థానిక రామకృష్ణాపురంలోని మినీ బైపాస్ రోడ్డులో లారీలు, ట్రావెల్స్ బస్సులు నిలిపి అక్కడే కడగడం, మరమ్మతులు చేసుకోవడం కనిపిస్తూనే ఉంది. భారీ వాహనాలతో పాటు చిన్న వాహనాలను సైతం మరమ్మతులు చేసుకునేందుకు స్థానిక ఆశ్రం కళాశాల వద్ద ఆటోనగర్ ఏర్పాటు చేసినా అటు వెళ్లడానికి మెకానిక్‌లు ఎవరూ ముందుకు రావడం లేదు.

క్రమబద్ధీకరణ పట్టని పాలకులు, పోలీసులు

ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించాల్సిన అధికారులు, ట్రాఫిక్ పోలీసులు అది తమ బాధ్యత కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మినీ బైపాస్ రోడ్డులో లారీలు, ట్రావెల్స్ బస్సులు నిలిపి ఉంచడంతో ఆ రోడ్డు ఛిద్రమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో లారీలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లినా వారు సమస్యను పరిష్కరించడంలేదని పలువురు వాపోతున్నారు.

కమిషనర్ స్పందించడం లేదు



నగరంలోని సమస్యలపై పలుమార్లు నగర కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా ఆయన నుంచి ఎటువంటి స్పందన లభించలేదు. దీనితో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. దీనిపై కలెక్టర్ కార్యాలయం నుంచి కమిషనర్‌కు ఆదేశాలు వస్తున్నాయి. అయినప్పటికీ కమిషనర్ లారీలను తొలగించేందుకు చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ప్రజల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు.

– రామనపూడి శివప్రసాద్, సామాజిక కార్యకర్త, న్యాయవాది


రాట్నాలమ్మ తల్లి ఆలయంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన రాట్నాలమ్మ తల్లి

పెదవేగి : రాట్నాలమ్మ తల్లి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మకు ఆదివారం ప్రీతికరమైన రోజుకావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, వారి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.16,935, పూజా టికెట్ల ద్వారా రూ.30,500, ఫొటోల అమ్మకంపై రూ.1500, విరాళాలు రూ. 5,500 అందాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ చెప్పారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

దెందులూరు: సత్యనారాయణపురంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలపాల విజయ్ కుటుంబ సభ్యులు మాగం సత్యనారాయణ ఆలయంలో బాబాకు ప్రత్యేక అలంకరణ, పూజ లు, ప్రదక్షిణలు, హోమాలు నిర్వహించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు నగరానికి చెందిన కోదండరామ భజన మండలి ఆధ్వర్యంలో హరే శ్రీనివాస కీర్తనలు ఆలపించారు. సాయంత్రం 5.30 గంటలకు నగరానికి చెందిన వేదాంతం విష్ణుప్రసాద్ మహాభారత వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7.15 గంటల నుంచి అభినయ నృత్య భారతి సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచార్య డి.హేమ సుందర్ శిష్య బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు ఆద్యంతం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అర్చక స్వాములు దివాకరుని వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

మోహన గుప్తా సామాజిక సేవలు ఆదర్శనీయం



కృష్ణమూర్తి సాహిత్య పురస్కార కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సేవా రంగంలో నగరానికి చెందిన మడుపల్లి మోహన గుప్తాది విశేష పాత్ర అని, ఏటా ఆయన కోట్ల రూపాయలు సేవా కార్యక్రమాలకు వినియోగించడం ఆదర్శనీయమని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ప్రముఖ రచయిత్రి ఓల్గాగా ప్రసిద్ధురాలైన పోపూరి లలిత కుమారికి గుప్త ఫౌండేషన్ సంస్థ ప్రతిష్టాత్మక అందచేస్తున్న శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గంగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపాదిస్తారని, కానీ కొంతమంది మాత్రమే తాము సంపాదించిన దానిలో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగిస్తారని అన్నారు. మడుపల్లి మోహన గుప్తా రెండవ కోవకు చెందిన వారన్నారు. గుప్తా ఫౌండేషన్‌ను స్థాపించి ఆ సంస్థ ద్వారా 2001 నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపన్నులకు సహాయం అందజేసిన మహామనిషి గుప్తా అన్నారు. ఆయన సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరో అతిథి ప్రొఫెసర్ చుండూరి మృణాళిని మాట్లాడుతూ గుప్తా ఫౌండేషన్ అందించే శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కారాన్ని అందుకోవడం గొప్ప విషయమని, తాను ఈ పురస్కారాన్ని 2020వ సంవత్సరంలో అందుకున్నానన్నారు. ఈ ఏడాది ఈ పురస్కారానికి రచయిత్రి ఓల్గాను ఎంపిక చేయడం సముచితమన్నారు. ఈ సందర్భంగా మడుపల్లి మోహన గుప్తా మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో 1994వ సంవత్సరం నుంచి శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కారాన్ని ప్రారంభించామన్నారు. సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సాహితీవేత్తలకు ఈ పురస్కారాన్ని అందజేస్తున్నామన్నారు. ఈ పురస్కారాన్ని ఇప్పటి వరకూ 20 మంది సాహితీవేత్తలకు అందించామని తెలిపారు. ఈ ఏడాది పురస్కారాన్ని ఐదు దశాబ్దాలుగా తెలుగు సాహిత్య రంగంపై తనదైన ముద్ర వేసిన ఓల్గాకు అందిచామన్నారు. తమ సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది ఏలూరు నగరంలోని వెంకన్న చెరువు అభివృద్ధికి రూ.కోటి కేటాయించామని, ఈ నిధులతో వచ్చే ఏడాది నాటికి చెరువును అభివృద్ధి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఏలూరు జిల్లాలోని జీలుగుమిల్లి మండలం వంకావారి గూడెంలోని వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు రూ.40 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేశామని, దీనిపై ప్రతి నెలా వచ్చే వడ్డీతో విద్యార్థులకు పోషకాహారం అందించే ఏర్పాటు చేశామన్నారు. దీనితో పాటు ఏలూరు నగరంలోని గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రికి రూ.15 లక్షల విలువైన అన్ని సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను ఇదే సందర్భంలో అందజేశామన్నారు. దానితో పాటు అదే ఆసుపత్రిలో తలసీమియా వ్యాధిగ్రస్తులకు రక్తమార్పిడి చేయడానికి అవసరమైన మినరల్ వాటర్ అందించడానికి రూ.3 లక్షలతో నీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనితో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆకివీడు మండలం ఐ భీమవరంలోని వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం విద్యార్థుల సౌకర్యార్థం రూ. 4 లక్షల విలువైన ఎలక్ట్రికల్ ఆటోను అందిస్తున్నామన్నారు. అనంతరం పురస్కార గ్రహీత ఓల్గా మాట్లాడుతూ కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, సమాజాన్ని మేల్కొలిపే సాహిత్యాన్ని అందించడానికి నిరంతరం కృషి చేయడానికి ఈ పురస్కారం ఒక ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గుప్తా కుటుంబ సభ్యులు, సంస్థ ఆడిటర్ డీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	28
వంకాయలు (కాంతులు)	24	బీన్స చిక్కుడు	36
వంకాయలు (తెలుపు)	18	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	32	బీట్‌రూట్	32
బీరకాయలు (పందిరి)	46	కీరా దోస	44
కాలీఫ్లవర్	00	ఫ్రెంచ్‌బీన్స్	60-72
క్యాబేజీ	16	అల్లం	50
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	28	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07-10
దోసకాయలు	24-38	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

గోదావరి నీటి కోసం ధర్నా

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో సత్యసాయి సంస్థ ద్వారా సరఫరా చేస్తున్న గోదావరి నీటిని సరఫరా చేయాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులు ధర్నా చేశారు. కేవీపీఎస్ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఇప్పటికైనా రెడ్డిగణపవరంనకు గోదావరి నీటిని సరఫరా చేయాలని ఆయన కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్	22.30	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

బేబీ కుటుంబ సభ్యులను పరామర్శించిన జేపీ



సముద్రేని బేబీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ఏలూరు ఇన్‌చార్జి జయప్రకాష్ (జేపీ)

ఏలూరు (టూటౌన్): పోణంగి వైఎస్సార్‌సీపీ కార్యకర్త సముద్రేని బేబీ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులను పార్టీ నాయకులు పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ), నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నేరుసు చిరంజీవి, సీనియర్ నాయకులు గేదెల సూర్యప్రకాష్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మద్దాల ఫణి, బంకురు వెంకట్, యూత్ నాయకులు బండ్లమూడి సునీల్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ముగిసిన జాతర మహోత్సవాలు



నాగదుర్గాదేవికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: కామవరం సమీపంలో ఉన్న దుర్గమ్మతల్లి, మంగమ్మతల్లి, నాగదుర్గాదేవి, గద్దెరాజుల జాతర మహోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా గిరిజన నృత్యాలు చేసి సందడి చేశారు. ఇక్కడికి చేరుకున్న బాలరాజుకు ఆలయ కమిటీవారు ఘన స్వాగతం పలికారు. ఆదివారం తెల్లవారుజామున ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో భక్తులు నడిచారు. అమ్మవారికి పుట్టింటి చీర, సారె, కావిడ్లతో నాటు కోళ్లు, మేక పోతులతో మొక్కులు తీర్చుకుని అన్నసమారాధన నిర్వహించారు. పీఠాధిపతి వర్సా పుల్లారావు, ఆలయ కమిటీ సభ్యులు కొర్సా రాంబాబు, మడివి శ్రీను, పూనెం దుర్గమ్మ, గోగుల గంగమ్మ పాల్గొన్నారు.

అమ్మవార్లకు చలిమిడి, పానకాలు సమర్పణ



మద్ది రామమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



భీమడోలులో భక్తుల క్యూలైన్‌ను పరిశీలిస్తున్న సీఐ



గ్రామదేవతలకు చలిమిడి, పానకాలు సమర్పిస్తున్న భక్తులు

భీమడోలు: పన్నెండేళ్లకోసారి వచ్చే భీమడోలు గ్రామ దేవతల జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజాము నుంచి మద్దిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజుకు చలిమిడి, పానకాలు సమర్పణ వేడుక కన్నుల పండువగా జరిగింది. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ కార్యక్రమానికి భారీగా భక్తులు తరలివచ్చారు. మహిళలు కుటుంబ సమేతంగా చిన్నా పెద్ద తేడా లేకుండా ఆలయానికి తరలిరావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీనితో ఆ ప్రాంతమంతా భక్తజన సంద్రంగా మారింది. విశేషంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని తమ భక్తిని చాటుకున్నారు. ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు వెళ్లి అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో చలిమిడి, పానకాలను సమర్పించారు. ఆలయ పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భీమడోలు సీఐ యూజే విల్సన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తును నిర్వహించారు. క్యూ లైన్లలోని భక్తులకు సీఐ విల్సన్ పలు సూచనలందించారు. జాతర కమిటీ సభ్యుడు తుమ్మల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తులను అన్నివేళలా కాచి కాపాడుతున్న గ్రామ దేవతలైన అమ్మవార్లకు 12 ఏళ్లకోసారి జాతర ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని, గ్రామం సుభిక్షంగా ఉండాలని, లోక కల్యాణార్థం అంగరంగ వైభవంగా జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయన్నారు. తొలుత అమ్మవార్లకు భక్తులు చీరలు, జాకెట్లను సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు. అమ్మవార్ల ఘటాలతో గణాచారులు పలు వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వారికి భక్తులు వస్త్రాలు పరిచి స్వాగతం పలికారు.